క్లుప్తంగా

ఎన్‌ఆర్‌సీ కేంద్రం తనిఖీ



పోషకాహార పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రాన్ని(ఎన్ఆర్‌సీ) శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య తనిఖీ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న పిల్లలకు అందుతున్న పోషకాహారం,వైద్యసేవల గురించి వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, రిపోర్టులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు,డాక్టర్ భారతి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత 'బిక్యాంపు క్లబ్'



విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న బి. క్యాంపు ఫుట్‌బాల్ క్లబ్ జట్టు

కర్నూలు (టౌన్): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న నగర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ముగిసాయి. ఫైనల్ పోరులో లక్ష్మీపురం జట్టుపై 2-0 గోల్స్ చేసి బి.క్యాంపు ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై 3-2 గోల్స్ చేసి బి.క్యాంపు క్లబ్ జట్టు గెలుపొందింది. బహుమతుల కార్యక్రమానికి నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఎం.ఎస్.వి. రాజు ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి పాల్ విజయ్‌కుమార్, ఫజుల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డ్వామా పీడీ

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఎదుట నిలిచే ఆర్టీసీ బస్సులను ఎక్కి వెళ్లే ప్రయాణికుల కోసం సాధు శివకుమార్‌రెడ్డి సేవాసంస్థ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ చలివేంద్రాన్ని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ రిటైర్డ్ సీఈఓ జయపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివారం పన్ను కౌంటర్లు పనిచేస్తాయి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో ఆదివారం పన్ను కౌంటర్లు పనిచేస్తాయని నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లించే పన్నుదారులకు 5 శాతం పన్ను రాయితీ ఉందని, ఈనెలాఖరు వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



గ్రాడ్యుయేషన్ పట్టాలతో చిన్నారులు

కర్నూలు సిటీ: స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ స్కూల్ ఈ-కిడ్స్ విభాగంలోని ప్రీ స్కూల్ విద్యార్థులకు శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్కూల్ ఏజీఎం రమేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు కోర్సు పూర్తి అయినట్లు సర్టిఫికెట్లను అందజేశారు. వేడుకల్లో చిన్నారులను గ్రాడ్యుయేషన్ పట్టదారుల వేషధారణలతో చూసిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆర్ఐ దుర్గాలక్ష్మీ, ఈ-కిడ్స్ కో-ఆర్డినేటర్ అరుణ, ఈ-ఛాంప్స్ కోఆర్డినేటర్ రెహాన పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేంద్ర

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ ఫౌజియా ఉస్మానియా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కళాశాలకు సక్రమంగా ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న విషయం రిటైర్డ్ ఐజీ, హిందూపురం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు తెలిసింది. దీంతో స్పందించిన ఆయన రూ.20 వేలు ఆర్థిక సాయం పంపించారు. శనివారం స్థానిక సీ. క్యాంపు సెంటర్‌లో మాజీ కార్పొరేటర్ గుడిపల్లి సురేందర్ ఆ విద్యార్థినికి నగదు అందజేశారు.

కాంస్యం సాధించిన వేద వచన్



వేదవచన్ డెఫ్ టెన్నిస్ క్రీడాకారుడు. స్థానిక ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూనే టెన్నిస్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో మధ్య ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి డెఫ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు తరపున పాల్గొని కాంస్య పతకం సాధించాడు. రాయలసీమ జోన్ స్థాయిలో నిర్వహించిన థెరిసమ్మ మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంటులో విన్నర్‌గా నిలిచాడు.

ప్రతిభ చాటుతున్న అర్షియా



కర్నూలు నగరానికి చెందిన అర్షియా కేవీఆర్ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈమె టెన్నిస్ క్రీడలో ప్రతిభ చూపుతూ పతకాలు సాధిస్తోంది. గతేడాది అనంతపురం జిల్లాలో నిర్వహించిన రాయలసీమ టెన్నిస్ టోర్నమెంటులో విన్నర్స్‌గా నిలిచింది. అలాగే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) క్రీడల్లో రన్నర్స్‌గా, థెరిసమ్మ మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంటు, సీఎం కప్ పోటీల్లోనూ విన్నర్‌గా నిలిచింది.

సీఎం కప్ విన్నర్ ఆదిమూలపు జాస్మిన్



ఆదిమూలపు జాస్మిన్ మాంటీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతుంది. ఈ ఏడాది నిర్వహించిన సీఎం కప్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని విన్నర్‌గా నిలిచింది. అలాగే నారాయణ టెన్నిస్ అకాడమీ పోటీల్లో ఉమెన్స్ డబుల్స్‌లో విన్నర్స్‌గా, థెరిసమ్మ మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంటులో అండర్-18 విభాగంలో విన్నర్‌గా నిలిచింది.

జాతీయపోటీలకు ఎంపికైన దేశం సాయి



దేశం సాయి శంకర్ ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నరసరావుపేటలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నర్‌గా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అనంతపురంలో జరిగిన రాయలసీమ జోన్ స్థాయి అండర్-14 పోటీల్లోను ప్రథమస్థానంలో నిలిచాడు. శాప్ క్రీడల్లోనూ ప్రతిభ చాటి విజేతగా నిలిచాడు.

పోటీకెళ్తే పతకమే!

- కర్నూలు నగరంలో టెన్నిస్‌కు పెరుగుతున్న ఆదరణ
- చదువుకుంటూనే క్రీడలో రాణిస్తున్న విద్యార్థులు
- ఏపీ సీఎం కప్, ఎస్‌జీఎఫ్ పోటీల్లో పతకాలు

కర్నూలు (టౌన్): అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన లాన్ టెన్నిస్ క్రీడకు కర్నూలులో మంచి ఆదరణ వస్తోంది. ఇప్పుడిప్పుడే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయిల్లో విద్యార్థులు ప్రతిభచాటుతూ వెలుగులోకి వస్తున్నారు. ఓ వైపు చదువుకుంటూనే టెన్నిస్‌లో రాణిస్తున్నారు. టెన్నిస్ పోటీలకు వెళ్తే పతకాలే లక్ష్యంగా సత్తాచాటుతున్నారు. స్పోర్ట్స్ అథారిటీకి చెందిన కోర్టులు లేకున్నా ప్రైవేటుగా అందుబాటులో ఉన్నాయి. స్థానిక బి.క్యాంపు ఆఫీసర్స్ క్లబ్, స్టేడియం పక్కన ఉన్న క్లబ్‌లో టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. ఇక్కడ సింథటిక్ కోర్టుల స్థానంలో క్లే కోర్టులు అందుబాటులో ఉన్నాయి. టెన్నిస్‌కు ఉన్న క్రేజీ వల్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఆవైపు ప్రోత్సహిస్తున్నారు. రెండేళ్లుగా కరోనా వల్ల క్రీడలకు బ్రేక్ పడినా..ఇప్పుడిప్పుడే జిల్లా కేంద్రం కర్నూలు నగరంలో క్రీడల వాతావరణం పెరిగింది. ఇటీవల జరిగిన ఏపీ సీఎం కప్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో నగర క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. సింథటిక్ కోర్టులు అందుబాటులోకి వస్తే మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు క్రీడా ప్రతినిధులు.



టెన్నిస్‌లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

నిరంతర సాధన ద్వారానే ఫలితాలు



నిరంతర సాధన ద్వారానే క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. మైపర్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ ఇస్తున్నా. ఎక్కువగా బాల్ ఫీడింగ్ చేయిస్తుంటాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం టెన్నిస్ క్రీడాంశంలో శిక్షణతో పాటు గేమ్ ప్రాక్టీసు ఉంటుంది. వార్మప్, స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్ మజిల్స్ స్ట్రెంగ్త్ వంటి ఎక్సర్ సైజ్‌లు ఉంటాయి. అన్ని విభాగాల్లో క్రీడాకారులు పతకాలు సాధిస్తున్నారు. - షేక్ మహమ్మద్ రఫీ, టెన్నిస్ చీఫ్ కోచ్

ఫ్లోరైడ్ గ్రామాల్లో పర్యటిస్తాం

- సమస్య పరిష్కారానికి చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



ఫ్లోరోసిస్ బాధితులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావానికి గురైన గ్రామాలను సందర్శించి అక్కడి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన చెప్పారు. శనివారం నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న 42 మందికి వీల్‌చైర్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మెజారిటీ మండలాల్లో ఫ్లోరోసిస్ ఉందని, ఆయా ప్రాంతాలకు సురక్షిత తాగునీటిని అందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాలను సందర్శించి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్లోరోసిస్ బాధితులకు రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ వారు రూ.2.10లక్షల విలువైన వీల్‌చైర్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే తరహాలో ప్రజలకు విస్తృతంగా సేవలు అందించాలని ఆమె సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో విస్తృతంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.మహేంద్రకుమార్, సభ్యులు డాక్టర్ కేవీ. సుబ్బారెడ్డి, జి. శ్రీనివాసులు, అరుణ, మధుసూదన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, రెడ్‌క్రాస్ రక్తనిధి వైద్యాధికారి డాక్టర్ రామచంద్రరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదరించాలి



సత్యహరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: కళాకారులను ఆదరించాల్సిన అవసరం ఉందని పలువురు సీనియర్ కళాకారులు అభిప్రాయపడ్డారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకల నాటక పోటీలు రెండో రోజు జరిగాయి. పోటీలను సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శేషయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రముఖ నాటక రచయిత పల్లేటి కులశేఖర్, సీనియర్ నటులు హెచ్.చంద్రన్నలు జ్యోతి ప్రజ్వలనతో నాటక పోటీలను ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం వంటి నాటకాల్లోని 9 ఘట్టాలను కళాకారులు ప్రదర్శించి తమ ప్రతిభను చాటారు. అనంతరం కళాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లు లక్ష్మీకాంతరావు, రాజారత్నం, సీనియర్ కళాకారులు మనోహర్‌బాబు, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా రాహుల్‌గాంధీపై వేటు

- డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంటిపేరుపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఆయన ఎంపీ స్థానంపై అనర్హత వేటు వేయడం రాజ్యాంగానికి విరుద్ధమని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీకి మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాహుల్‌గాంధీని ఎదుర్కొనలేకనే మోదీ అనర్హత వేటు వేశారని, భవిష్యత్‌లో రాహుల్ దెబ్బను మోదీ తట్టుకోలేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాహుల్ ప్రధాన మంత్రి అవుతారన్నారు. కర్నూలు బార్ మాజీ అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ..ప్రతిపక్షాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. తక్షణమే రాహుల్‌పై అనర్హత వేటును ఎత్తివేయాలన్నారు. బీసీ సంఘం జిల్లా నాయకులు శేషఫణి మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న రాహుల్‌ను నిలువరించడానికే వేటు వేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యానారాయణ గుప్తా, సీనియర్ జర్నలిస్టు సత్యం, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సోమసుందరం, రాయలసీమ మాదిగ దండోర నాయకులు అనంతరత్నం పాల్గొన్నారు.

లైసెన్స్‌ల జారీ పూర్తి పారదర్శకం

- మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



కమీషన్ ఏజెంట్లకు రెన్యువల్ చేసిన లైసెన్స్‌లను అందచేస్తున్న చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌ల రెన్యువల్‌లో ఎటువంటి అక్రమాలకు తావు లేదని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అనంతరం రెన్యువల్ లైసెన్స్‌లను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..మార్కెట్‌లో 177 మంది కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లను రెన్యువల్ చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 113 మందికి లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియ పూర్తి అయిందని, ఇందులో 90 మందికి లైసెన్స్‌లను అందజేసినట్లు వివరించారు. లైసెన్స్‌ల రెన్యువల్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, డబ్బులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు. వంద శాతం నిబంధనలకు లోబడి లైసెన్స్‌లు జారీ చేస్తున్నామని, ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరైన డబ్బులు ఇచ్చారని తమ దృష్టికి వస్తే అటువంటి కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని, మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు ప్రత్యక్షంగా, లేదా పరోక్షంగా ముడుపులు డిమాండ్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధే తమ లక్ష్యమని, అక్రమాలను సహించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ గోవిందు, అసిస్టెంటు సెక్రటరీ రహిమాన్, సూపర్‌వైజర్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ డిమాండ్ చేశారు. సీపీఎస్ పెన్షనర్లు చనిపోతే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలువడంలేదన్నారు. శనివారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో చనిపోయిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలను పరామర్శించారు. డోన్ మండలం దేవరబండలో ఎస్‌జీ టీచర్‌గా పనిచేస్తూ దస్తగిరి మరణించారు. ఈ క్రమంలో ఏపీజేఏసీ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కర్నూలులో పనిచేస్తూ పదవి విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగి ఇమ్మానుయేల్, మునిసిపల్ హైస్కూలులో ఉద్యోగం చేస్తూ మరణించిన కాంతమ్మ ఇళ్లను సందర్శించి వారి కుటుంబ సభ్యుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

వారంలోపు పార్టీ మండల అధ్యక్షుల నియామకం

కర్నూలు(టౌన్): వారం రోజుల వ్యవధిలో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పార్టీ మండల అధ్యక్షులను నియమిస్తామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం కర్నూలులోని ఓ హోటల్‌లో రాయలసీమ స్థాయి జిల్లాల న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1020 పోలీసు స్టేషన్లు, 35 మహిళా పోలీసు స్టేషన్ల పరిధిలో పార్టీ న్యాయవాదులను నియమించనున్నట్లు చెప్పారు. పొత్తుల గురించి ఇప్పుడే మాట్లాడాల్సిన సమయం కాదన్నారు. జనసేన నేత పవన్‌కల్యాణ్ ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం చేసే రెండో విడత కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో పార్టీ న్యాయ విభాగం ఉపాధ్యక్షులు రామచంద్రరావు, కర్నూలు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, పార్టీ నాయకులు చింతా మోహన్, రేఖాగౌడ్, హసీనాబేగం, వెంకట్, చల్లా వరుణ్ పాల్గొన్నారు.

పరీక్షలు జరిగిన ఆరు నెలలకు ఫలితాలు

- గతేడాది సెప్టెంబరు/అక్టోబరులో ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు
- మూల్యాంకనం మూడు యూనివర్శిటీల్లో చేశామంటున్న ఆర్‌యూ అధికారులు



రాయలసీమ యూనివర్శిటీ ముఖ ద్వారం

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీ పరీక్షల విభాగం పని తీరుపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఏ యూనివర్శిటీలోనైనా పరీక్షలు నిర్వహిస్తే నెల, రెండు నెలల్లో ఫలితాలు ప్రకటిస్తారు. కానీ ఆర్‌యూలో పీజీ ఫోర్త్ సెమిస్టర్ గతేడాది సెప్టెంబరు/అక్టోబరు నెలలో పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలు మాత్రం సుమారు ఆరు నెలల తరువాత శనివారం విడుదల చేయడం అనేక విమర్శలకు తావిస్తుంది. కాగా పీజీ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులు 813 మంది హాజరుకాగా, 717 మంది ఉత్తీర్ణులు అయ్యారు. సప్లమెంటరీ పరీక్షలు 247 మంది రాయగా, 126 మంది పాసయ్యారు. ఈ పరీక్షలే కాదు..ఎల్ఎల్‌బీ, బీఈడీ, బీపీఈడీ తదితర పరీక్షలు సైతం గతేడాది డిసెంబరు నెలలో నిర్వహించి ఫలితాలు నాలుగు నెలల తరువాత ఇటీవలే ప్రకటించారు. ఈ విషయంపై ఆర్‌యూ పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లును అడగగా పీజీ పరీక్షలు గతేడాది సెప్టెంబరు/అక్టోబరు నెలలో నిర్వహించామని, మూల్యాంకనం మరో యూనివర్శిటీలో జరగడం, తరువాత మళ్లీ మరో రెండు యూనివర్శిటీల్లో వెరిఫై చేయడంతోనే ఫలితాలు ఆలస్యం అయ్యాయని చెప్పారు. పీజీ పరీక్షల కాబట్టి మూడు యూనివర్శిటీల్లో మూల్యాంకనం జరుగుతుందని, అదే డిగ్రీ పరీక్షలు అయితే ఒకే చోట జరుగుతాయి కాబట్టి ఫలితాలు త్వరగా వస్తాయని సమాధానం ఇచ్చారు.

17 నుంచి ఉప్‌ధ్యాన్ త్యాప్ దీక్ష

కర్నూలు కల్చరల్: కర్నూలు జైన్ శ్వేతాంబర్ మూర్తిక్ సంఘ్ కుటుంబ సభ్యులు ఉప్‌ధ్యాన్ త్యాప్ దీక్షకు తరలి వెళ్లారు. సేలం సమీపంలోని ఎర్‌కాడ్ హిల్ స్టేషన్‌లో 48 రోజులు పాటు నిర్వహించే దీక్షకు కర్నూలు నుంచి 25 మంది జైన్‌లు శనివారం వెళ్లారు. 45 రోజుల పాటు రోజుకు ఒకసారే ఆహారం స్వీకరిస్తూ స్నానం, అన్ని సౌఖ్యాలకు (ఫ్యాన్స్, లైట్స్ లేకుండా) దూరంగా ఉంటూ ధ్యానం చేస్తూ దీక్షను ఆచరిస్తారని సంఘం సభ్యులు తెలిపారు. దీక్ష అనంతరం దీక్షలో పాల్గొన్న వారికి గురువులు మోక్షికి మాలను బహుకరిస్తారని పేర్కొన్నారు.

17 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: పాలీసెట్-2023 ప్రవేశ పరీక్షకు ఈ నెల 17 నుంచి స్థానిక ఎం.జి పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎం.వి.ఎస్.ఎస్.ఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు పాలీటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని, శిక్షణకు హాజరయ్యే వారికి ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9492403015 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న ఆ స్కూల్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ మౌనిక, తదితరులు

కర్నూలు సిటీ: శ్రీచైతన విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఇన్‌స్టో ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చూపించినట్లు ఆ విద్యా సంస్థలకు చెందిన ఏజీఎం సురేష్ తెలిపారు. శనివారం బుధవారపేటలోని శ్రీచైతన్య స్కూల్ బ్రాంచ్‌లో జరిగిన అభినందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తమ విద్యార్థులు 105 మంది ఇటీవలే నిర్వహించిన ఒలంపియాడ్ సెకెండ్ లెవెల్ పరీక్షల్లో పాల్గొని 100 శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ఆ బ్రాంచ్ ప్రిన్సిపాల్ మౌనిక, ఆర్.ఐ వి.వెంకటేష్, డీన్ వీరయ్య ఆచారి, ప్రైమరీ ఇన్‌చార్జీ రమ్య, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అప్రెంటీస్‌పై సదస్సు

కర్నూలు సిటీ: ఈ నెల 17, 18 తేదిల్లో నేషనల్ అప్రెంటీస్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ కాలేజీ(బాలికలు), జిల్లా కన్వీనర్ పి.వి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలోని డోన్ ఐటీఐ కాలేజీలో ఉదయం 10 గంటలకు ఉమ్మడి కర్నూలు, వైఎస్ఆర్ కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పారిశ్రామికవేత్తల ప్రతినిధులకు/పాలిటెక్నికల్ కాలేజీ/వొకేషనల్ కాలేజీ, ఐటీఐ కాలేజీలకు 17న అవగాహన వర్క్‌షాపు, 18న నిరుద్యోగ యువతీ, యువకులకు, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారికి అప్రెంటీస్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కర్నూలు విద్యార్థికి ఐఐఎంలో సీటు



సాయి రోహిత్

కర్నూలు సిటీ: అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జిల్లా విద్యార్థి సీటు సాధించారు. కర్నూలు వ్యవసాయశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న హెచ్.రూపేష్ కుమారుడు హెచ్. సాయి రోహిత్ ఐఐఎంలో ప్రవేశం కోసం క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్)రాశారు. 97.57 పర్సెంటైల్ సాధించి అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం ఈయన హైదరాబాదులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో ప్రొబిషనరీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. పదోతరగతిలో 9.8 సీజీపీ పాయింట్లు, ఇంటర్మీడియేట్‌లో 1000 మార్కులకు980మార్కులు సాధించి,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ నాగపూర్‌లోని వీఎన్ఐటీలో పూర్తి చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ చిన్న బజారి



రైల్వే స్టేషన్ వద్ద కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫైర్ సిబ్బంది

కర్నూలు: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్, కర్నూలు అగ్నిమాపక కేంద్ర అధికారి చిన్న బజారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవరోజు కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ సర్కిల్, కొండారెడ్డి బురుజు, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌తో పాటు రద్దీ ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, సంపదను ఎలా కాపాడుకోవాలని అనే దానిపై పలు చోట్ల డెమో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను మహిళలు, ఆటో కార్మికులకు పంపిణీ చేశారు. అగ్ని మాపక పరికరాలను ప్రదర్శిస్తూ వాటి వినియోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఫైర్‌మెన్లు రామాంజనేయులు, ప్రతాప్, రాంబాబు, హనుమంతు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

కల్లూరు: యువత నైపుణ్యాలను మెరుగుపరచుకుని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని సీడాప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు సూచించారు. శనివారం బి.తాండ్రపాడు టీటీడీసీ సమావేశపు హాల్‌లో సీడాప్, డీఆర్‌డీఏ సిబ్బంది జాబ్ మేళాలు, స్కిల్స్ డెవలప్‌మెంట్, స్కిల్ హబ్స్, స్కిల్ ట్రెనింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కర్నూలు, నంద్యాల డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లు వెంకటసుబ్బయ్య, బి.శ్రీధర్‌రెడ్డితో పాటు సీడాప్ సీఈఓ హాజరై మాట్లాడారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనులు

కల్లూరు/ఓర్వకల్లు: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని చెట్లమలాపురం, ఓర్వకల్లు మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయా చోట్ల కూలీలతో మాట్లాడారు. వేతనం రూ. 257 నుంచి రూ.272 పెరిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేసి పూర్తి వేతనం పొందాలన్నారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో కూలీలు ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 10 గంటల్లోపు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట డ్వామా ఎంఅండ్ఈ సిద్దలింగమూర్తి, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల తదితరులు ఉన్నారు.